సాక్షి
విజయనగరం
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



పరిశోధనకు ప్రభుత్వ సాయం

వ్యవసాయ రంగం అభివృద్ధికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సాయం చేస్తోంది. పరిశోధనలను ప్రోత్సహిస్తోంది. - 8లో



గొప్ప ఆర్థిక వ్యవస్థగా భారత్

భారత్ గొప్ప ఆర్థిక వ్యవస్థగా మారనుందని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, పద్మ భూషణ్ ఎన్.చంద్రశేఖరన్ అన్నారు. - 8లో



పాలకొండలో దొంగలు హల్‌చల్

పాలకొండ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఎస్‌ఐ ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎంపీ, నాయకులు, అధికారులు

చీపురుపల్లి రూరల్: జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కర్లాం గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో జిల్లాలో తొలుతగా నిర్మించిన వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీని, 15.74 లక్షల ఖర్చుతో నిర్మించిన మిల్క్‌బల్క్ సెంటర్‌ను, రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగన్నరేళ్ల పాలనలో కర్లాం పంచాయతీలోని వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల కింద రూ.23కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. పంచాయతీలో రూ.6 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, ఇంటింటికీ తాగునీరు సౌకర్యాలు కల్పించామన్నారు. కర్లాం నుంచి నిమ్మలవలస పంచాయతీకి తారు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా శంకుస్థాపన చేసి రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి ఆర్థిక వెలుగులు నింపుతోందన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్, ఎంపీటీసీలు బాణాన భాగ్యలక్ష్మి, రామరత్నం, శ్రీనివాసరావు, రమణ, పార్టీ మండలాధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత




బాధిత కుటుంబానికి రాజాంలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పట్టణంలోని కొండంపేట గ్రామానికి చెందిన నగిరెడ్డి సునీత మృతి చెందగా, ఆమె భర్త నగిరెడ్డి సూరిబాబుకు రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే కంబాల జోగులు రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం అందజేశారు. నగిరెడ్డి సునీత అనారోగ్యంతో అస్వస్థతకు గురైంది. ఆమె వైద్యం కోసం కుటుంబ సభ్యులు అప్పులు చేసినా, బతికించుకోలేకపోయారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం ఎమ్మెల్యే జోగారావు దృష్టికి రావడంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. దీంతో రూ.5 లక్షల సాయం మంజూరైంది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంబాల సందీప్, పి.శ్రీనివాసరావు, ఎస్.తులసీరావు, ఎం.సత్యారావు, ఎస్.వేణుగోపాలనాయుడు,కె.సతీష్, జి.దాలినాయుడు, సూరప్పునాయుడు పాల్గొన్నారు.

సీఐలకు స్థానచలనం

విజయనగరం క్రైమ్: విశాఖరేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు సీఐలను బదిలీలు చేస్తూ రేంజ్ డీఐజీ కె.హరికృష్ణ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. చినమేరంగి సర్కిల్ సీఐ సీహెచ్ ప్రసాద్‌ను విశాఖరేంజ్ వీఆర్‌కు, పాలకొండ సర్కిల్ సీఐ కె.మురళీధర్‌ను చినమేరంగి సర్కిల్‌కు, విశాఖరేంజ్ వీఆర్‌లో ఉన్న ఎం.చంద్రమౌళిని పాలకొండ సర్కిల్‌కు, విజయనగరం సీసీఎస్‌లో ఉన్న ఎం.బుచ్చిరాజును అచ్యుతాపురం సర్కిల్‌కు, అచ్యుతాపురం సీఐ వై.మురళీరావును విశాఖరేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.



బ్రదర్ ఆఫ్ బంగార్రాజు

అత్యంత విలువైన ఖనిజాన్ని దక్కించుకునేందుకు 'విష' ప్రయోగంతో క్రమక్రమంగా ఒక గ్రామాన్నే తెరమరుగు చేయడానికి మహేష్‌బాబు సినిమాలో ఓ ప్రతినాయకుడు చేసిన ప్రయత్నం చూశాం... ఇక్కడ కోట్ల రూపాయల విలువైన భూములను గుప్పిట పట్టేందుకు భోగాపురం మండలంలో ఓ టీడీపీ నాయకుడు 2000-01 సంవత్సరం నుంచి ఇంకా చెప్పాలంటే అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పెద్దల ఆశీస్సులతో ఏకంగా రెవెన్యూ రికార్డులను క్రమక్రమంగా తనకనుగుణంగా మార్చేసిన తీరు చూడొచ్చు! పరుల భూమికి జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) మంజూరు చేసిన పరిహారాన్ని నొక్కేయడంతో ప్రారంభమైన ఈ ప్రహసనం ... చివరకు ఆ భూమి మొత్తం గుప్పిటపట్టేవరకూ వచ్చేశారు.

- భోగాపురంలో భూబాగోతాల గలీజు
- పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని భూమి రికార్డుల తారుమారు!
- గత టీడీపీ పాలనలో చక్రం తిప్పిన కర్రోతు సత్యనారాయణ
- జాతీయ రహదారుల సంస్థకే 2000-01లో ఝలక్
- పరుల భూమికి వచ్చిన పరిహారాన్ని నొక్కేసిన వైనం
- భోగాపురం తహసీల్దార్ నివేదికతో ఆలస్యంగా వెలుగులోకి!

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విశాఖ జిల్లా పద్మనాభం మండలం రేవిడి గ్రామానికి చెందిన భూపతిరాజు సూర్యనారాయణరాజుకు భోగాపురం మండలం పోలిపల్లి, భీమునిపట్నం మండలం అమనాం గ్రామాల సరిహద్దులో సుమారు 450 ఎకరాల జిరాయితీ ఉండేది. ఈ భూముల సాగు, పర్యవేక్షణ పనులకు ఆయన వారసుడైన భూపతిరాజు వెంకట జోగి జగన్నాథరాజు అమనాం గ్రామానికి చెందిన తిరుమారెడ్డి ఆదినారాయణను, రావాడకు చెందిన అమనాపు సన్యాసిని నియమించుకున్నారు. 1956 దశకంలో ఈనాం రద్దు చట్టం వచ్చినప్పుడు నిబంధనల ప్రకారం కౌలుదారులుగా ఉన్న తిరుమారెడ్డి ఆదినారాయణ, అతని సోదరుడు వెంకయ్యలకు రెండొంతులు, భూమి యజమాని రాజు కుటుంబీకులకు ఒక వంతు చొప్పు భూమి కేటాయించేందుకు సెటిల్‌మెంట్ జరిగింది. అలా తిరుమారెడ్డి ఆదినారాయణ సోదరులకు 75 ఎకరాల వరకూ భూమి వచ్చింది. సాగుకు అనుకూలంగా లేని ఆ భూమిని తదనంతర కాలంలో సున్నంబట్టీల నిర్వహణ నిమిత్తం కొంతమందికి ఇచ్చారు. ఆదినారాయణ అవివాహితుడు. వెంకయ్య కొడుకు అప్పలస్వామి ప్రేమ వివాహం చేసుకొని, గొడవల వల్ల గ్రామంలో ఉండలేక ఏలూరుకు వలసపోయారు. అప్పుడప్పుడు వచ్చి ఆ భూములను చూసివెళ్తుండేవారు. 1971లో వెంకయ్య చనిపోయిన తర్వాత ఆ భూములపై పర్యవేక్షణ తగ్గిపోయింది.

జాతీయ రహదారి విస్తరణే అవకాశం

బాధితుల చెప్పిన వివరాల ప్రకారం.... స్వర్ణ చతుర్భుజి పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2000-01 సంవత్సరంలో చెన్నై-హౌరా జాతీయ రహదారి విస్తరణకు తలపెట్టింది. ఆ ప్రక్రియలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 27లో తిరుమారెడ్డి ఆదినారాయణకు చెందిన 1.74 ఎకరాల భూమి పోయింది. ఇందుకు ఎకరాకు రూ.10 లక్షల చొప్పున ఎన్‌హెచ్‌ఏఐ పరిహారాన్ని మంజూరు చేసింది. ఈ విషయం తెలియక ఆదినారాయణ, వెంకయ్య వారసులెవ్వరూ తీసుకోవడానికి రాలేదు. అప్పటి టీడీపీ ప్రభుత్వ పాలనలో కర్రోతు సత్యనారాయణ భోగాపురం మండలంలో చక్రం తిప్పేవారు. ఆయనకు ఎన్‌హెచ్‌ఏఐ పరిహారంపై కన్నుపడింది. రెవెన్యూ సిబ్బంది సహకారంతో రికార్డుల్లోకి తన పేరు చొప్పించారు. ఎన్‌హెచ్‌ఏ జారీ చేసిన చెక్కును సొమ్ము చేసుకున్నారు. అంతేకాదు ఆ పరిహారానికి సంబంధించిన రికార్డునూ ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయంలో మాయం చేసేశారు.

అక్రమాలు ఆలస్యంగా వెలుగులోకి....

తిరుమారెడ్డి ఆదినారాయణ వారసుల ఫిర్యాదును పరిశీలించిన విజయనగరం కోర్టు... తక్షణమే దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని భోగాపురం పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించింది. విచారణలో భాగంగా వారు భోగాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. దీంతో తహసీల్దార్ రికార్డులను పరిశీలించి గత ఆగస్టు నెలలో నివేదిక ఇచ్చారు. ఎన్‌హెచ్‌ఏఐ పరిహారాన్ని కర్రోతు సత్యనారాయణకు చెల్లించడం వాస్తవమేనని, అది అక్రమ వ్యవహారమేనని అందులో పేర్కొన్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారాన్ని ఎలాగైనా కప్పిపుచ్చేయడానికి కర్రోతు వర్గం ప్రయత్నాలు మొదలెట్టింది. సత్యనారాయణ సోదరుడు కర్రోతు బంగార్రాజు ప్రస్తుతం టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న నేపథ్యంలో ఇది ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

• రెవెన్యూ రికార్డుల గల్లంతు

తమ భూమి ఆక్రమణలకు గురిఅవుతుందని తెలుసుకున్న తిరుమారెడ్డి ఆదినారాయణ వారసులు ఆలస్యంగా మేల్కొన్నారు. పోలిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని భూములకు సంబంధించి ఇనాం సెటిల్‌మెంట్ రిజిస్టర్, ల్యాండ్ సీలింగ్‌కు సంబంధించిన వివరాలు, అడంగల్, ఎఫ్‌ఎంబీ, ఎఫ్‌సీఓ తదితర రికార్డుల నకలు కావాలని సమాచార హక్కు చట్టం కింద భోగాపురం తహసీల్దార్‌కు గత ఏడాది దరఖాస్తు చేశారు. ఎఫ్‌ఎంబీ, ఎఫ్‌సీఓ తప్ప పోలిపల్లికి సంబంధించిన మరే ఇతర రికార్డు తమ కార్యాలయంలో లేదని తహసీల్దార్ బదులిచ్చారు. ఎఫ్‌సీఓ ప్రకారం సర్వే నంబర్లలో 27/1, 2, 4 (కొంతభాగం)ని 1.74 ఎకరాలకు సంబంధించిన సొమ్మును కర్రోతు సత్యనారాయణకు చెల్లించినట్లు ఉండటంతో బాధితులు అవాక్కు అయ్యారు. ఏ హక్కుతో అతనికి సొమ్ము చెల్లించారో ఇవ్వాలని మళ్లీ ఆర్‌టీఐ ద్వారా భోగాపురం తహసీల్దార్‌కు, ఎన్‌హెచ్‌ఏఐకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పరిహారానికి సంబంధించిన ఏ ఒక్క ఆధారం తమ వద్ద లేదని సమాధానం వచ్చింది. విజయనగరం ఆర్డీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించడంతో అక్కడకు వెళ్లినా అదే సమాధానం ఎదురైంది. దీంతో తిరుమారెడ్డి ఆదినారాయణ వారసులు కోర్టును ఆశ్రయించారు.

11 నుంచి స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

- విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు

విజయనగరం: విద్యార్థి దశలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ నెల 11 నుంచి జిల్లా వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీలను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ కోరారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణపై రాజీవ్ ఇండోర్ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులతో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఈ నెల 11, 12, 13 తేదీల్లో రాజీవ్ క్రీడామైదానంలోని బాక్సింగ్‌రింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-14, 17, 19 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 800 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. పోటీల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వసతి, భోజన సదుపాయాల్లో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకూడదని చెప్పారు. సమావేశంలో వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ప్రజావసరాలు తీర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పథకాల అమలు
- అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలవాలన్నదే మోదీ సంకల్పం
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



సబ్సిడీపై మహిళకు గ్యాస్ కనెక్షన్‌ను అందజేస్తున్న మంత్రి అశ్వనీ వైష్ణవ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం అర్బన్/వేపాడ: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని, ప్రజావసరాలు తీర్చే దిశగా పథకాలు అమలుచేస్తున్నాయని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దేశ ప్రజలందరి సహకారంతో భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారన్నారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి గ్రామంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తొమ్మిదిన్నరేళ్ల మోదీ హయాంలో దేశంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక ప్రయోజనం చేకూరిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో వలే పల్లెల్లోనూ ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నట్టు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా రూ.5 లక్షల వరకు ఆరోగ్యబీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ కార్యక్రమాన్ని రూపొందించినట్టు చెప్పారు.

- రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తోందన్నారు. రాష్ట్రంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు.
- కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గత నెల 25 నుంచి జిల్లాలో చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఇప్పటివరకు 156 గ్రామాల్లో పూర్తి చేశామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు.
- ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా జీవన ప్రమాణాలు పెంచేందుకు వివిధ పథకాలు అమలుచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ 'సంక్షేమ' సంతోషం కనిపిస్తోందన్నారు. పథకాల ఆర్థిక లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే చేరుతోందని వెల్లడించారు.



వేదికపై థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పథకాల స్టాల్స్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి

కేంద్ర ప్రభుత్వ పథకాలకు చెందిన 12 స్టాల్స్‌ను సభా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. మై భారత్ వలంటీర్ రిజిస్ట్రేషన్, ఉజ్వల యోజన పథకం, ఆయుష్మాన్ భారత్, హెల్త్ స్క్రీనింగ్, 100 శాతం డిజిటలైజేషన్ విలేజ్ షోయింగ్ మ్యాప్, పీఎంజే అనుద్ది కేంద్ర స్టాల్, బ్యాంకింగ్ సెక్టార్ స్కీమ్స్, ఆధార్ ఎన్‌రోల్స్, భూ పరీక్ష, నేచురల్ ఫార్మింగ్, పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు, నాబార్డు యాక్టివిటీస్, ఐఈసీ డిస్ట్రిబ్యూషన్ తదితర స్టాల్స్‌ను మంత్రి నేరుగా వెళ్లి పరిశీలించారు. ఆయా స్టాల్స్‌వద్ద లబ్ధిదారులకు విత్తనాలు, బీమాచెక్కులు, మందులు, సేంద్రియ ఎరువులు, పోషకాహార కిట్లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు, కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరి, పంచాయతీరాజ్ ప్రాంతీయ జోనల్ కార్యదర్శి మిరపల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, సర్పంచ్ శానాపతి లీల, ఎంపీటీసీ సభ్యురాలు గాడి గంగతల్లి తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు విద్యార్థినులు థింసా నృత్యంతో అలరించారు.

విన్నపాలపై సానుకూల స్పందన...

రైల్వేకు సంబంధించి స్థానికుల విన్నపాలను విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందిస్తూ, విశాఖపట్నం నుంచి పర్యాటకులు అరకు వెళ్లేందుకు సౌకర్యంగానున్న విశాఖ-కిరండోల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు శృంగవరపుకోట రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల సరిహద్దులో ఉన్న కొత్తవలస రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దడానికి ప్రధాని మోదీ నిర్ణయించారని చెప్పారు. వారానికి రెండుసార్లు మాత్రమే తిరుగుతున్న విశాఖ-వారణాశి రైలును డైలీ సర్వీసుగా చేసే విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

• పల్లకిలో పెళ్లిజంట



పెళ్లంటే నూరేళ్ల పంట.. జీవితాంతం గుర్తుండిపోయేలా నందడిగా జరుపుకోవాలని యువ జంటలు ఆకాంక్షిస్తాయి. తాహతుకు మించి ఖర్చుచేస్తాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం సంప్రదాయాలను గౌరవిస్తున్నారు. దీనికి బొబ్బిలి పట్టణంలోని తారాక రామాకాలనీలో పెళ్లి పల్లకిలో శనివారం ఊరేగుతున్న వధూవరులే నిలువెత్తు నిదర్శనం. పెద్దల మాట, ఊరి కట్టుబాట్లను గౌరవిస్తూ డీజే శబ్దాలకు దూరంగా కాలుష్యరహితంగా పల్లకిలో ఊరేగారు. పెద్దల ఆశీర్వాదాలు అందుకున్నారు. - బొబ్బిలి

రాజీయే ఉత్తమ మార్గం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి



కక్షిదారులకు భోజనం వడ్డిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి

- కుటుంబ కలహాలు మానండి, వివాదాలకు దూరంగా ఉండండి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కుటుంబ కలహలతో, వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలను దూరం చేసుకోవద్దని, కుటుంబ సభ్యులతో పట్టింపులకు పోయి కలహాలతో చక్కని జీవితాలను పాడుచేసుకోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి బి.హెచ్.వి.లక్ష్మీకుమారి అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా న్యాయ స్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లేనిపోని తగాదాల కు పోయి మనశ్శాంతిని దూరం చేసుకోరాదని, కక్షిదారుల హక్కు లను కాపాడుతూ, కోర్టుల్లో ఉన్న వ్యాజ్యాలను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ మధ్య కాలంలో కుటుంబ తగాదాలు పెరుగుతుండడంపై ఆవేదన వ్యక్తంచేశారు. కేసుల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి డబ్బు, కాలాన్ని వృథా చేసుకోవద్దన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, గజపతినగరం, చీపురుపల్లి, కొత్తవలస, కురుపాం కోర్టుల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌ల ద్వారా 1,764 కేసులను పరిష్కరించినట్టు వెల్లడించారు. 89 మోటార్ ప్రమాదబీమా కేసులను పరిష్కరించామని, రూ. 1,85,95,281 మొత్తాన్ని కక్షిదారులకు అందజేశామన్నారు. 6,924 మంది కక్షిదారులకు ప్రయోజనం కలిగిందని చెప్పారు.

కార్యక్రమంలో న్యాయమూర్తులు షేక్‌సికిందర్ భాష, కె.నాగమణి, ఎన్.పద్మావతి, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చొక్కాపు ధామోదరరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు. కక్షిదారుల కోసం వైద్యశిబిరాలు నిర్వహించారు. పంపాన రవికుమార్, పి.ఎ. ఎన్.రాజు, సీనియర్ న్యాయవాదుల సహకారంతో కక్షిదారులకు మధ్యాహ్న భోజనం కల్పిస్తామన్నారు.

ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులు	
విజయనగరం	1065
పార్వతీపురం	115
బొబ్బిలి	134
సాలూరు	109
ఎస్.కోట	47
గజపతినగరం	143
చీపురుపల్లి	117
కొత్తవలస	34
కురుపాం	--
మొత్తం	1764

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని ఉడా కాలనీ కవితాబార్ వద్దనున్న గాయత్రీ బేకరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకుని విచారణ చేయగా మృతుడి వయసు సుమారు 45 నుంచి 55 ఏళ్ల వ్యక్తి అని తెలిసిందన్నారు. అతని వద్ద ఎటు వంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామన్నారు. బంధువులెవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

- 1200 లీటర్ల బెల్లపు ఊట, 40 లీటర్ల సారా ధ్వంసం
- ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: ఆంధ్రా – ఒడిశా రాష్ట్ర సరిహద్దుల్లో సారా తయారీ కేంద్రాలు ఉన్నాయన్న ముందస్తు సమాచారంతో వాటిని గుర్తించి శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించామని ఎస్‌ఈబీ సీఐ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలం కొత్తవలస గ్రామంలో సారా తయారీ చేస్తున్న పీడిక అను అలియాస్ వాసు అనే వ్యక్తి ఒడిశా ప్రాంతం నుంచి వలస వచ్చి కొత్తవలస గ్రామంలో ఉంటూ సారా తయారు చేస్తున్నారని ఆయన తెలిపారు. సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లపు ఊట, 40లీటర్ల సారాను ధ్వంసం చేసి అనుపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జుడీషియల్ మెజిస్ట్రేట్ వారి ముందు హాజరు పరిచామని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


పసగడ ముగడమ్మ (ఫైల్)

మెరకముడిదాం: రాజాం, రామభద్రపురం ప్రధాన రహదారిలో మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో పసగడ ముగడమ్మ(73) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన పసగడ ముగడమ్మ అనే వ్యక్తి శుభ కార్యక్రమానికి బంధువులను పిలిచేందుకు మెరకముడిదాం మండలంలో పలు గ్రామాలకు శుక్రవారం వెళ్లాడు. తిరిగి తన ఇంటికి బయలుదేరి వెళ్తుండగా శుక్రవారం రాత్రి రాజాం, రామభద్రపురం ప్రధాన రహదారిలో ఉత్తరావల్లి జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగడమ్మ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృతదేహం గుర్తు తెలియనంతగా నుజ్జయ్యింది. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న ముగడమ్మ కుమారుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధరాయవలస ఎస్ఐ నవీన్‌పడాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు

- లారీని తప్పించబోయి కాలువలోకి దూసుకెళ్లిన బస్సు


ప్రమాదానికి గురైన కేవీఆర్ ట్రావెల్స్ బస్సు

బొండపల్లి: విజయవాడ నుంచి పార్వతీపురం వస్తున్న కేవీఆర్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు ఎదురుగా వేగంగా వస్తున్న లారీని తప్పించబోయి జాతీయ రహదారి 23కు అనుకొని ఉన్న సాగునీటి కాలువలోకి శనివారం ఉదయం దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. బస్సు ముందు నుంచి ప్రయాణికులు రావడానికి వీలు లేకపోవడంతో ఎమర్జెన్సీ డోర్ తెరిచి బయటపడ్డారు. ప్రయాణికులంతా స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

పరిశోధనకు ప్రభుత్వ సాయం

రైతు సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ సంస్థల అభివృద్ధికి తన వంతు సాయం చేస్తోంది. ఇందులో భాగంగా గాజులరేగలోని వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి చేయూతనందిస్తోంది. ప్రభుత్వ సాయంతో పరిశోధన స్థానంలో కొత్త రకం వంగడాల అభివృద్ధిలో శాస్త్రవేత్తలు దూసుకువెళ్తున్నారు.

- నాలుగున్నరేళ్లలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- పరిశోధన స్థానంలో చిరుధాన్యాలపై పరిశోధనలు
- మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్, బిస్కెట్ కటింగ్ యూనిట్లు ఏర్పాటు
- ఇప్పటికే కొత్త చోడి వంగడాలను అందించిన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు


వ్యవసాయ పరిశోధన స్థానం


కురుకురే రోస్టర్


కురుకురే తయారు చేసే మిషన్

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ రంగం అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పంట పెట్టుబడికి నిధులు అందజేస్తోంది. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుల ముంగిటకే విత్తనాలు, ఎరువులు అందిస్తోంది. ముఖ్యంగా రైతు పండించిన పంటను కూడ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. రైతుకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని, నూతన వంగడాలను అందించే గాజులరేగలోని వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి కూడా ప్రభుత్వం సాయాన్ని అందిస్తోంది. పరిశోధన స్థానం అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందించింది. వ్యవసాయ పరిశోధన స్థానంలో చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తున్నారు. ఇక్కడ అభివృద్ధి చేసిన వంగడాలు జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందాయి.

1996 నుంచి ఇక్కడ పరిశోధనలు

1996వ సంవత్సరంలో ప్రభుత్వం 22.67 ఎకరాలను కొనుగోలు చేసి పరిశోధన స్థానానికి అప్పగించింది. దీంతో అప్పటి నుంచి ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. ఇందులో రెండు ఎకరాల్లో భవనాలు ఉండగా 20 ఎకరాల్లో పరిశోధనలు చేస్తున్నారు.

కొత్తగా రాగి, సజ్జ, ఉలవ కొత్త వంగడాలు

వ్యవసాయ పరిశోధన స్థానంలో చిరుధాన్యాలు రాగి (చోడి), సజ్జ, ఉలవ పంటలకు సంబంధించి పలు రకాల నూతన వంగడాలను ఇప్పటికే అందించారు. చోడికి సంబంధించి 9 వంగడాలను, సజ్జకు సంబంధించి రెండు రకాలను, ఉలవ పంటకు సంబంధించి ఒక రకాన్ని అందించారు. చోడి పంటకు సంబంధించి 2019లో వేగావతి రకాన్ని అభివృద్ధి చేశారు. 2020లో సువర్ణముఖి, ఇంద్రావతి రకాలను అభివృద్ధి చేశారు. ఇందులో ఇంద్రావతి రకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. 2022లో గోస్తానీ రకాన్ని విడుదల చేశారు.

అవసరం మేరకు నిధులు



వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులను అందిస్తోంది. మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్, బిస్కెట్ కట్టర్ వంటి యూనిట్లు ఏర్పాటు చేశారు. నిరంతరం పరిశోధనలు చేసి రైతులకు అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను అందిస్తున్నాం.

– డాక్టర్ నర్సుపల్లి అనురాధ, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి

సజ్జకు సంబంధించి విజయ కంపోజిట్, విశాఖ కంపోజిట్ రకాలను అందించారు. ఉలవ పంటకు సంబంధించి వీజెడ్ఎం – 1 రకాన్ని అందించారు. అంతేకాకుండా చిరుధాన్యాలు, వరి, మొక్కజొన్న వంటి పంటలకు ఆశించే తెగుళ్లపై నిరంతరం పరిశోధనలు చేస్తున్నారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులను వెచ్చిస్తోంది. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను విడుదల చేసింది. వీటిలో పాల యూనిట్లు ఏర్పాటు చేయడంతో పాటు గిరిజన ప్రాంత రైతులకు విత్తనాలను, రైతులకు అవసరమైన వివిధ ప్రయోజనకరమైన పరికరాలను అందిస్తోంది. చిరుధాన్యాల పంట ఉత్పత్తులను నేరుగా విక్రయిస్తే కొనుగోలుకు పెద్దగా వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఉప ఉత్పత్తులు పొడర్లు, బిస్కెట్లు, మిక్సర్ వంటివి తయారు చేసి విక్రయిస్తే చిన్న పిల్లలు సైతం కొనుగోలుకు ముందుకు వస్తారు. మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్, రవ్వ మేకింగ్ మిల్, బిస్కెట్ కట్టర్, మిల్లెట్ పప్ బాల్స్ మిషన్ యూనిట్లును ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం రైతులకు చిరుధాన్యాల విత్తనాలను కూడా రాయితీపై అందిస్తోంది. వీటితో నాటు కోళ్ల పెంపకానికి సంబంధించి బ్రూడర్లు, ఇంకుబేటర్, మల్లిప్లేక్సులు వంటివి అందిస్తున్నారు.

అధునాతన శిక్షణతో ప్రయోజనం


గౌరవ వందనం స్వీకరిస్తున్న అడిషనల్ డీజీ రవికిరణ్

- అడిషనల్ డైరెక్టర్ జనరల్ రవికిరణ్

విజయనగరం క్రైమ్: అధునాతన పద్ధతుల్లో శిక్షణ తీసుకోవడం ఎంతో ఉపయోగకరమని విశాఖ నాసిన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఈ.రవికిరణ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ శిక్షణా కళాశాలలో మూడు వారాల పాటూ కస్టమ్స్ హవల్దార్స్ 57 మందికి శిక్షణ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా శనివారం హాజరయ్యారు. పాసింగ్ అవుట్ పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వారాల పాటూ ఫిజికల్, ఆరమ్స్, ఫైరింగ్ విభాగాల్లో నేర్చుకున్న శిక్షణ మీ జీవితానికి పునాది వంటిదన్నారు. సర్వీస్ కాలంలో శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పివి.అప్పారావు మాట్లాడుతూ ఇండోర్, అవుట్‌డోర్‌లో ప్రత్యేక శిక్షణ అందజేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ జెఎం.కిశోర్, అసిస్టెంట్ డైరెక్టర్ గిరిధర్, సూపరింటెండెంట్ టి.పణిధర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

గజపతినగరం రైల్వేగేటు వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటుకు వినతి


కేంద్ర రైల్వేశాఖ మంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని

బొండపల్లి: గజపతినగరం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా ఫ్లైఓవర్ నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. వేపాడ మండలం వీలుపర్తిలో జరిగిన వికసిత్‌భారత్ సంకల్పయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన రైల్వే మంత్రిని విశాఖపట్నం విమానాశ్రయంలో ఆమె కలిశారు. ఇక్కడ రైల్వే గేటు వల్ల కలిగే ఇబ్బందులు, ఫ్లైఓవర్ ఆవశ్యకతను వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రైల్వే గేటు ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విశాఖపట్టణం డివిజనల్ రైల్వే మేనేజర్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు పావని తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



సబ్ జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

- రెండవ రోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు
- సబ్ జూనియర్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

విజయనగరం: జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, క్యాడెట్ బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలు రెండవ రోజు శనివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో గల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో బాల, బాలికలు పోటాపోటీగా తలపడ్డారు. పూర్తిగా ఎల్క్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో పారదర్శకంగా నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించటంలో ఉత్సాహాన్ని కనబరిచారు. ఇదిలా ఉండగా రెండవ రోజు సాయంత్రానికి సబ్ జూనియర్స్ విభాగంలో బాల, బాలికలకు పోటీలు ముగియగా.. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో విజయనగరం, ప్రకాశం, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆదివారం మూడవ రోజు క్యాడెట్ విభాగంలో పోటీలు నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయటం జరుగుతుందని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డివి.చారి ప్రసాద్ తెలిపారు. పోటీలను ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్, టోర్నీ చైర్మన్, సీతం విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దాడ మధు, గదుల సత్యలత, పాల్గొన్నారు.

గొప్ప ఆర్థిక వ్యవస్థగా భారత్


న్యూ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్

- టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, పద్మభూషణ్ నటరాజన్ చంద్రశేఖరన్

రాజాం: ఒకప్పుడు భారత్ కేవలం ఒక ఆర్థిక శక్తిగా ఉండేదని, త్వరలో భారత్ గొప్ప ఆర్థిక వ్యవస్థగా మారనుందని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, పద్మభూషణ్ నటరాజన్ చంద్రశేఖరన్ నటరాజన్ అన్నారు. జీఎంఆర్ ఐటీ కళాశాలను ఆయన శనివారం సందర్శించారు. తొలుత జీఎంఆర్ ఐటీ న్యూ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఐటీ విద్యార్థులు ప్రదర్శించిన బిజినెస్ పెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ ఏ 1 పవర్డ్ చాట్ ఎన్‌లైజర్, ఏ1 సాంకేతికతలను ఉపయోగించి వాయిస్ అసిస్టెంట్‌లతో కూడిన సంజ్ఞ నియంత్రిత వర్చువల్ మౌస్, కీ బోర్డు, వంటి ఐటీ ప్రదర్శనలు తిలకించారు. అనంతరం ఐటీ విద్యార్థులు, జీసీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, జీఎంఆర్ డీఏవీ విద్యార్థులతో పాటు ఐటీ అధ్యాపకులు, జీఎంఆర్ కేర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. సమ్మిళిత వృద్ధి ఆవశ్యకతను వివరించిన చంద్రశేఖరన్, ప్రపంచంలో శ్రామిక జనాభాలో మూడింట రెండొంతుల మందితో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని అన్నారు. నాణ్యమైన సౌకర్యాలతో పాటు అంకితభావంతో కూడిన అధ్యాపకులతో అత్యుత్తమ సంస్థలో భాగమైనందుకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన ఆయన విద్యార్థి దశలో తలచుకుంటే ఏమైనా సాధించగలరని వివరించారు.

జీఎంఆర్ సేవలు అద్భుతం..

అంతకు ముందు జీఎంఆర్ గ్రూపు సేవలపై నటరాజన్ చంద్రశేఖరన్ మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, సమాజ సేవలపై జీఎం రావు చేస్తున్న కృషి చాలా గొప్పదని వెల్లడించారు. ఇక్కడి జీఎంఆర్ ఐటీ విద్యార్థులు దేశ విదేశాల్లో అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్ పొందారని అన్నారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ఐటీ విద్యార్థులతో పాటు జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు, డీఏవీ స్కూల్ విద్యార్థులను అభినందించారు. జీఎంఆర్ గ్రూప్స్ అధినేత జీఎంఆర్ మాట్లాడుతూ జీఎంఆర్ వీఎఫ్ స్థాపన, సేవలను వివరించారు. నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న సామాజిక, ఆర్థిక పరివర్తన కార్యక్రమాలు, ఉపాధి కల్పన కార్యక్రమాలపై వివరించారు. నటరాజన్ చంద్రశేఖరన్‌ను బొబ్బిలి వీణ, పొందూరు ఖాదీతో సత్కరించారు. జీఎంఆర్ గ్రూప్స్ ఎయిర్ పోర్ట్స్ విభాగం బిజినెస్ చైర్మన్ జీబీఎస్ రాజు, రవాణా, ఇన్ఫ్రా బిజినెస్ చైర్మన్ బీవీఎన్ రావు, జీఎంఆర్ సోదరులు గ్రంధి నీలాచలం, గ్రంధి చినవెంకటేశ్వర్లు, సీఈఓ అశ్విని లోహని, కోఆర్డినేటర్ ఎల్ఎమ్ లక్ష్మణమూర్తి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొండలో దొంగలు హల్‌చల్

- పోలీసుల ఇళ్లనూ వదల్లేదు..
- ఒకే రాత్రి మూడు చోట్ల దొంగతనం
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- ఆందోళనలో పట్టణ ప్రజలు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివప్రసాద్


నగదు కోసం దొంగలు చెల్లాచెదురు చేసిన బీరువా

పాలకొండ: ప్రజలకు కష్టం కలిగితే పోలీసుల వద్దకు వెళ్తారు.. మరి పోలీసులకు కష్టం కలిగితే ఎవరి వద్దకు వెళ్తారు.. అనే సినిమా డైలాగ్ ఇప్పుడు పాలకొండ పట్టణంలో వినిపిస్తుంది. ఇందుకు కారణం దొంగలు పోలీసుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఇంట్లో ఉన్న సొత్తును దోచుకుపోవడమే కారణం. ఒకే రాత్రి పట్టణంలో మూడు ఇళ్లలో తాళాలు బద్దలు కొట్టి దొరికిన కాడికి దోచుకుపోయిన సంఘటన పాలకొండలో సంచలనంగా మారింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం దిశ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ లావణ్య ఇంట్లో చొరబడి బంగారు అభరణాలు, నగదు దోచుకెళ్లారు. విధుల నుంచి శనివారం ఉదయం ఇంటికి వచ్చిన ఆమె దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే పంచాయతీరాజ్ కార్యాలయంలో పని చేస్తున్న గార కాంతారావు ఇంటి తాళాలు పగులగొట్టి రూ.2లక్షల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. డీఎస్పీ కార్యాలయం వెనుక ఒకే ఇంట్లో ముగ్గురు కానిస్టేబుల్స్ అద్దెకు ఉంటున్నారు. ఆ ఇంటి తాళం కూడా విరగ్గొట్టి అందిన కాడికి దోచుకున్నారు. బాధితులు దొంగతనం జరిగినట్టు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీమ్‌ను రప్పించి పరిశీలించారు. ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి, సంఘటన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పేద విద్యార్థులకు ఉచితంగా నర్సింగ్ సీట్లు

శ్రీకాకుళం రూరల్: ఎంసెట్‌లో పాసై, నీట్ పరీక్ష రాసిన పేద విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉచితంగా కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసిన అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి కోర్సు ఫీజును జీతం నుంచి మినహాయిస్తామన్నారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు మూడు నెలలు పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాకుళం రాగోలులో గల జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్ కార్యాలయాన్ని లేదా 76809 45357, 91219 99654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

లారీ ఢీకొని అయ్యప్ప స్వామి భక్తుడు దుర్మరణం

పీలేరు రూరల్: లారీ ఢీకొని అయ్యప్పస్వామి భక్తుడు దుర్మరణం చెందిన సంఘటన పీలేరు – రాయచోటి జాతీయ రహదారి రాయలవారిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మన్యం జిల్లా పాచిపేట మండలం మాతుమూరు గ్రామానికి చెందిన ఆవుల నారాయణ (60) తోటి అయ్యప్పస్వామి భక్తులతో కలసి ఈ నెల 6న ఇరుముడి కట్టి టూరిస్టు బస్సులో శబరిమలై యాత్ర ప్రారంభించారు. శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాలు చూసుకుంటూ శనివారం ఉదయం పీలేరు సమీపంలోని రాయలవారిపల్లె వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు పక్కన బస్సు ఆపారు. నారాయణ రోడ్డు దాటే క్రమంలో రాయచోటి వైపు నుంచి వచ్చిన సిమెంట్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ మోహన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.చింతలవలస వద్ద అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ శనివారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన బి.పెంటయ్యపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.